



# ఈకాలం

THE HONEST TELUGU DAILY





గురువారం 22-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :83 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# దావోస్‌లో లైఫ్ సైన్సెస్ పాలసీని విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

## టాటా గ్రూప్ ఛైర్మన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. స్టేడియాల అభివృద్ధిపై ఆసక్తి

దావోస్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన కొనసాగుతోంది. బుధవారం ఆయన టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని ఆయన్ను సీఎం కోరారు. విజన్–2047 లక్ష్యాలు, పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను వివరించారు.

హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. మూసీ నది పునరుజ్జీవంలో భాగస్వామ్యానికి, రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మ్యానుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది.



దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ పాలసీని విడుదల చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఈ పాలసీని ఆవిష్కరించారు. 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యంగా ఈ పాలసీని విడుదల చేశారు. ఈ రంగంలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రణాళిక రూపొందించింది. ఉత్తమ పరిశోధనాభివృద్ధి, అధునాతన బయోలాజిక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వనుంది. థెరపీలతో పాటు పర్యావరణహిత ఉత్పత్తులే ప్రాధాన్యంగా పాలసీని రూపొందించింది.

# అంతరిక్షం నుంచి చూస్తే..

## ఆ గొడవలు చాలా 'సిల్లీ' : సునీతా విలియమ్స్

- దృక్పథంలో మార్పు: అంతరిక్ష ప్రయాణం తన జీవితం పట్ల ఉన్న ఆలోచనా ధోరణిని పూర్తిగా మార్చివేసిందని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు.
- విభేదాలు 'సిల్లీ': అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు మనుషుల మధ్య ఉండే గొడవలు, విభేదాలు చాలా చిన్నవిగా (సిల్లీగా) అనిపిస్తాయని ఆమె చెప్పారు.
- భూమి అంతా ఒక్కటే: మొదట తన మూలాలున్న భారత్, స్లోవేనియా వంటి ప్రాంతాల కోసం వెతికినా.. చివరికి భూమి అంతా ఒకటేనని, మనమంతా కలిసి మెలిసి ఉండాలని అర్థమైందని వివరించారు.



2లో

# మార్కెట్లపై బేర్ పట్టు..

## 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ రాజకీయ భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో సూచీలు భారీగా పతనమవుతున్నాయి. ఉదయం 11.05 గంటల సమయంలో సెన్సెక్స్ 886 పాయింట్ల నష్టంతో 81,295 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 250 పాయింట్లు క్షీణించి, 24,981 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు కోల్పోయింది.

మార్కెట్ పతనానికి కారణాలు..

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది.

పేజి 2లో

## ఏపీ మద్యం కేసు.. ముగ్గురు నిందితులకు సుప్రీంలో ఎదురుదెబ్బ



2లో

# ప్రపంచ ఆర్థిక సదస్సు..

## సీఎం రేవంత్‌తో కలిసి పాల్గొన్న చిరంజీవి



హైదరాబాద్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తో కలిసి ప్రముఖ నటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న సీఎం.. సదస్సుకు రావాలని ఆహ్వానించారు. దీంతో ఆయన హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి వీక్షించారు.

పేజి 2లో

## అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క

ధర్మపురి గ్రామీణం: తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పేజి 2లో



## జీహెచ్‌ఎంసీ విభజనపై ఫిబ్రవరి 10న స్పష్టమైన నిర్ణయం: పొన్నం ప్రభాకర్



2లో

- నిర్ణయ గడువు: జీహెచ్‌ఎంసీ విభజనపై ఫిబ్రవరి 10వ తేదీన ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటిస్తుందని మంత్రి తెలిపారు.
- కొత్త నిర్మాణం: పరిపాలన సౌలభ్యం కోసం నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లుగా విభజించారు.
- పాలకవర్గ గడువు: ప్రస్తుత జీహెచ్‌ఎంసీ పాలకవర్గం గడువు ఫిబ్రవరి 10తో ముగియనుంది.

## తెలంగాణలో భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు



హైదరాబాద్: తెలంగాణలో భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. రాష్ట్రంలో 47 మందిని బదిలీ చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎస్ఈసీ మార్గదర్శకాల మేరకు కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

## చట్టసభలకు రాని సభ్యులకు 'నోవర్క్-నోపే' అమలు చేయాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అమరావతి: శాసనసభకు ఒక్క రోజు కూడా హాజరు కాకుండా కొందరు ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. పేజి 2లో

# తిరుమలలో రథసప్తమి..

## శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు రద్దు!



2లో

## సింగరేణిపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది: కిషన్‌రెడ్డి



దిల్లీ: దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు.

పేజి 2లో

## టీ20 ప్రపంచ కప్.. అది వింత అనుభవం అవుతుంది: రోహిత్ శర్మ

తొలిసారి టీ20 ప్రపంచ కప్‌నకు దూరం కావడంపై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఎమోషనల్ అయ్యాడు. మొదటిసారి టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను పేజి 2లో



# సంపాదకీయం

## విపక్ష వైరుధ్యాలే బీజేపీ విజయ సోపానాలు

'భారత రాజకీయాల్లో కులం పోషించే సంక్లిష్ట పాత్రను గుర్తించడంలో కమ్యూనిస్టులు విఫలమయ్యారని అంగీకరించాలి. అదే విధంగా ప్రజలపై మతం ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడంలో కూడా మేము విఫలమయ్యాం. కమ్యూనిస్టులు అనుసరించే గతితార్కిక భౌతికవాదం ప్రజల చేతనలో భాగం కాలేదు' అని మరియం అలెగ్జాండర్ బేబీ గత ఏడాది పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఒక ఇంటర్వ్యూలో అన్నారు. కేరళకు చెందిన బేబీ హయాంలోనే ఇవాళ కమ్యూనిస్టుల ఏకైక కోట అయిన ఆ రాష్ట్రంలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారం కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఆ స్థానంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ కేరళలో పెరుగుతోన్న బీజేపీ ప్రభావాన్ని అడ్డుకోలేకపోతోంది. మతపరమైన సంప్రదాయాలు, విశ్వాసాల గురించి జనంలో ప్రస్తావించేటప్పుడు ఆచితూచి మాట్లాడాలని ప్రస్తుత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా పార్టీ నేతలకు హితవు చెప్పారంటే కేరళలో బీజేపీ ప్రభావాన్ని ఆయన కూడా తక్కువ అంచనా వేయడంలేదనే చెప్పాలి. ఇవాళ దేశ వ్యాప్తంగా బీజేపీ విస్తరించడానికి వామపక్షల వైఫల్యమే కారణమని సీపీఎం నేతల మాటల ద్వారానే అర్థం చేసుకోవచ్చు. భారతీయ జనతా పార్టీ చరిత్రలో ప్రప్రథమంగా బిహార్‌కు చెందిన యువ నేత నితిన్ నబీ జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెలువరించిన ప్రసంగంలో ఒక కొత్త ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 2014లో ఢిల్లీలో అడుగుపెట్టినప్పటి నుంచీ మోదీ క్రమక్రమంగా పార్టీపై పట్టు బిగుస్తూ పార్టీ యావత్తూ తన కనుసన్నలలో నడుస్తూ, తాను ఎవరిని సూచిస్తే వారిని కిమ్మనకుండా పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నుకునేలా చేస్తున్నారు. ఇదేమీ చిన్నవిషయం కాదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం, మహారాష్ట్రలో స్థానిక ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించిన తర్వాత సంభవించిన పరిణామమిది. ముంబైతో సహా 25 ప్రధాన నగరాల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాబోయే ఎన్నికల్లో కేరళలో కూడా బీజేపీని ప్రజలు ఆదరిస్తారన్న ఆశాభావాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు.కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా రాజకీయాలు మారిపోతున్నాయి. మహారాష్ట్రలో అయితే మరీ వేగంగా మారుతున్నాయి. థకరే, శరద్ పవార్ పార్టీలను చీల్చడంలో బీజేపీ విజయవంతమయింది. క్రమంగా కాంగ్రెస్ కానీ, ప్రాంతీయ పార్టీలు కానీ బీజేపీని ఎదుర్కోవడంలో విఫలమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం ఇటీవల మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో మరింత స్పష్టమైంది. ఈ పార్టీలు విఫలమయినప్పుడు దేశంలో ముస్లిం ఓటర్లు తమకొక ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తారని, ఏఐఎంఐఎం వంటి పార్టీని ఆశ్రయిస్తారని ఈ ఎన్నికలు తేల్చాయి. మహారాష్ట్రంలో థకరే, పవార్ కుటుంబాలు మొదటి నుంచీ బలంగా ఉన్న ప్రాంతాల్లో సైతం తమ పట్టును కోల్పోయాయి. మోదీ జాతీయ స్థాయిలో అడుగుపెట్టకముందు మహారాష్ట్రలో బలహీనంగా ఉన్న బీజేపీ ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర శక్తిగా మారింది. బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై తాత్కాలిక విజయం సాధించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి తుడిచిపెట్టుకుపోయింది. గ్రామ పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రబల శక్తిగా ఆవిర్భవించింది. 2014కు ముందు 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో తన స్థానమేమిటో తేల్చుకోలేని అగమ్యగోచర స్థితిలో ఉన్నది. గుజరాత్, బిహార్, ఒడిషాలో మాదిరి మహారాష్ట్రలో కూడా బీజేపీ అధికారం సుస్థిరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో అతి పెద్ద పార్టీగా ఇప్పటికే విస్తరించిన బీజేపీ స్వాతంత్ర్యానంతరం కొన్ని దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి లభించిన ప్రాబల్యాన్నే సాధించిందనడంలో అతిశయోక్తి లేదు. కాంగ్రెస్, వామపక్షలు, ఇతర బీజేపీయేతర పార్టీల సైద్ధాంతిక వైఫల్యానికి ఇది నిదర్శనం.కొత్త జాతీయ అధ్యక్షుడు ఎన్నికైన సమయంలో మహారాష్ట్ర స్థానిక ఎన్నికల తర్వాత కేరళ గురించి మోదీ ప్రస్తావించడం గమనార్హం. జనవరి 23న కేరళలో పర్యటించనున్న మోదీ ఆ రాష్ట్రంలో బీజేపీ ఎంతో కొంత కాలుమోపడంపై ఉత్సాహంతో ఉన్నారనడంలో సందేహం లేదు. 1980లో బీజేపీ ఆవిర్భవించిన తర్వాత దాదాపు రెండున్నర దశాబ్దాల వరకూ కేరళలో ఆ పార్టీకి ఉనికి కూడా లేదు. 2016లో బీజేపీ తొలి అసెంబ్లీ సీటు గెలుచుకుని అనేక నియోజకవర్గాల్లో ఓట్ల శాతాన్ని పెంచుకుంది. అయిదారు కార్పొరేషన్లలో ప్రతిపక్ష స్థానం సాధించింది. 2024లో తొలి లోక్‌సభ సీటును సాధించడమే కాక 19 శాతం ఓట్లను దక్కించుకుంది. అయిదు లోక్‌సభ సీట్లలో బీజేపీకి రెండు లక్షలకు పైగా ఓట్లు లభించాయి. 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధిక ఓట్లు సాధించగా, 9 సీట్లలో రెండవ స్థానం సాధించింది.గత ఏడాది కేరళ స్థానిక ఎన్నికల్లో తొలి మునిసిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకుంది. రాష్ట్ర రాజధాని అయిన తిరువనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 సీట్లు సాధించి 45 సంవత్సరాలుగా వామపక్ష ఫ్రంట్ గుప్పిట్లో ఉన్న అనేక స్థానాలను కైవసం చేసుకుంది. 174 గ్రామపంచాయతీలు, 4 జిల్లా పంచాయతీలు, నాలుగు సిటీ కార్పొరేషన్లు దక్కించుకున్న బీజేపీ కేరళలో దాదాపు 15 శాతం ఓట్లు సాధించగలిగింది. అన్నిటికన్నా ఎక్కువగా తిరువనంతపురంలో 23 శాతం దక్కించుకోగా, అనేక చోట్ల 19 శాతం ఓట్లను సాధించింది. క్రమంగా కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌ల తర్వాత బీజేపీ మూడో స్థానం కోసం ఉరకలు వేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 33 స్థానాల్లో 30 నుంచి 65వేల ఓట్ల వరకు సాధించిన బీజేపీ ఈ సారి ఓట్ల శాతం పెంచుకుంటుందనడంలో సందేహం లేదు. ఎన్ని సీట్లు గెలుచుకుంటుందో చెప్పలేము కాని దాదాపు 40- నుంచి 60 సీట్లలో బీజేపీ దాదాపు 20 శాతం ఓట్లను సాధించే అవకాశాలు లేకపోలేదు.

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వయనాడ్ సీటులో విజయం సాధించినప్పటికీ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షల చేతుల్లో తాము రెండవసారి ఎందుకు ఓడిపోయిందీ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ నేతలకు అర్థం కావడం లేదు. అయితే పదేళ్ల వామపక్ష ఫ్రంట్ సర్కార్ పట్ల వ్యతిరేకత మాత్రం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 20 లోక్‌సభ సీట్లు సాధించడం, గత ఏడాది స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకోవడం కేరళలో కాంగ్రెస్ పునరుత్థానాన్ని సూచిస్తోంది. సాధారణంగా అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా స్థానిక ఎన్నికల్లో తన సత్తా చూపిస్తుంది. కాని కేరళలో అలా జరగలేదంటే ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదన్నమాటే. అత్యధిక నిరుద్యోగం,

# తిరుమలలో రథసప్తమి..

## శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు రద్దు!

మొదటి పేజీ తరువాయి

తిరుమల: ఈ నెల 25న రథ సప్తమిని వైభవంగా నిర్వహించాలని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బుధవారం తితిదే అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి జిల్లా, తితిదే అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాలు, లడ్డూలు, రద్దీ నిర్వహణ, స్వచ్ఛ కార్యక్రమాలు, అత్యవసర సేవల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, గ్యాలరీల్లో, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

రథసప్తమి రోజున వాహన సేవల వివరాలు..

తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనం

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం

మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం

సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం

రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనం

రథ సప్తమి నేపథ్యంలో స్వామివారి ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేశారు. ఎన్‌ఆర్‌ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ప్రివిలేజ్ దర్శనాలూ నిలిపివేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. తిరుపతిలో జనవరి 24 నుంచి 26 వరకు స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతోపాటు బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తితిదే తెలిపింది.

## చట్టసభలకు రాని సభ్యులకు 'నోవర్క్-నోపే' అమలు చేయాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మొదటి పేజీ తరువాయి

ఇలాంటి అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు.

"కొందరు ఎమ్మెల్యేలు ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. సభకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తుంటే వేదన కలుగుతోంది. అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఉంటారా?ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్–నో పే' నిబంధన అమలు చేయాలి. అలాంటి వారిని రీకాల్ చేసేలా ప్రజలకు హక్కు కల్పించాలి" అని అయ్యన్నపాత్రుడు సూచించారు.

# మార్కెట్లపై బేర్ పట్టు..

## 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

మొదటి పేజీ తరువాయి

నేటి సెషన్‌లో తొలిసారి ఏకంగా 91.28కి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న అనిశ్చితులు, డాలర్లకు గిరాకీ పెరగడం వంటి కారణాలు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇక, దక్షిణకొరియా, జపాన్, హాంకాంగ్ వంటి ఆసియా మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. నిన్న అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.

పసిడి పరుగులు.. ఒక్కరోజే రూ.9వేలకు పైగా పెరిగి..

విదేశీ సంస్థాగత మదుపర్లు భారత స్టాక్ మార్కెట్ నుంచి భారీగా నిధులు వెనక్కి మళ్లించడం సూచీల పతనానికి ఓ కారణం. నిన్న ఒక్కరోజే రూ.2,938.33 కోట్లు ఉపసంహరించుకున్నారు. జనవరిలో వరుసగా 11వ సెషన్‌లోనూ ఈ అమ్మకాలు కొనసాగడం గమనార్హం. మార్కెట్ అస్థిరతను కొలిచే వీఐఎక్స్ నాలుగుశాతం పెరిగి 13.22కి చేరింది.

ట్రంప్ టారిఫ్ ప్రకటనలతో మదుపర్లు అప్రమత్తతో వ్యవహరిస్తున్నారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సహకరించని ఐరోపా యూనియన్ దేశాలపై సుంకాల ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యంలో అంతరాయాలను కలిగిస్తున్నాయి. బ్యాంకింగ్ షేర్లు కుదేలవడం మిగతా రంగాల పైన కూడా ప్రభావం చూపుతోంది.

## జీహెచ్‌ఎంసీ విభజనపై ఫిబ్రవరి 10న స్పష్టమైన నిర్ణయం: పొన్నం ప్రభాకర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ విభజనపై ఫిబ్రవరి 10న ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బల్దియా విభజనలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. ఫిబ్రవరి 10తో జీహెచ్‌ఎంసీ పాలకవర్గం గడువు ముగియనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్లతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

హైదరాబాద్ మహానగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లుగా విభజించిన సందర్భంగా ఆయా జోనల్ కమిషనర్లు, సర్కిల్ అధికారులను పరిచయం చేసుకున్న మంత్రి.. ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యత ఇకపై పూర్తిగా అధికారులదేనన్నారు. పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు ఇలా ప్రతి అంశంలోనూ ప్రశ్నించేవాళ్లు ఎక్కువ అవుతారని, వారికి బదులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జోనల్ స్థాయిలో అధికారులతో పనిచేయించే బాధ్యత కమిషనర్‌దేనని అన్నారు.ం

## సింగరేణిపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

"బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారు?సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలి. సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది" అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

## అభివృద్ధి అంటే భవనాల నిర్మాణమే కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి

జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు

# అంతరిక్షం నుంచి చూస్తే..

మొదటి పేజీ తరువాయి

అంతరిక్షయానం తనలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. అంతరిక్షం నుంచి భూమిని ఓ గ్రహంగా చూసినప్పుడు.. జీవితం పట్ల తన దృక్పథన్ని మార్చివేసిందన్నారు. పలు అంశాలపై మనుషుల మధ్య విభేదాలు, గొడవలు పడటం చాలా సిల్లీగా అనిపిస్తుందన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. 'ఐస్ ఆన్ స్టార్స్, ఫీట్ ఆన్ ది గ్రౌండ్' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా అంతరిక్షయానంలో (రాజుఝుఎివ ¯త్రీుజవశ్రీ) తన అనుభవాలను పంచుకున్నారు."మనం అంతరిక్షనికి వెళ్లినప్పుడు ప్రతిఒక్కరు తమ ఇల్లు ఎక్కడుందని వెతకాలనే అనుకుంటారు. నా తండ్రి భారత్‌కు చెందిన వారు.. తల్లి స్లోవేనియా వ్యక్తి. అందుకే మొదట ఈ ప్రదేశాల గురించే చూశా. తొలుత నిర్దిష్ట ప్రదేశం (ఇల్లు) కోసం వెతికినా.. చివరకు భూమి అంతా ఒకటేనని తెలుసుకుంటాం. సముద్రాలు, మారుతున్న కాలాలు, ధృవాలు.. ఇలా అంతరిక్షం నుంచి అద్భుతమైన ఈ గ్రహాన్ని చూసినప్పుడు జీవితం పట్ల ఆలోచనా ధోరణి మారుతుంది.

వ్యక్తుల మధ్య విభేదాలపై మన అభిప్రాయాన్ని మారుస్తుంది. మనమంతా ఒక్కటే కదా.. కలిసి మెలసి పనిచేయాలనే భావనను కలిగిస్తుంది. అంతేకాదు.. ఓ ఇల్లాలిగా కుటుంబంలో వాదనల గురించి అర్థం చేసుకుంటా. కానీ, వాస్తవం ఏంటంటే.. అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు ఇవి సిల్లీగా అనిపిస్తాయి" అని సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. ఎప్పుడైనా దేనిగురించైనా భయపడ్డారా? అనే ప్రశ్నకు బదులిస్తూ.. చాలా విషయాలకు భయపడతానని, తాను నివాసముండే చోట ఎలుగుబంట్లు ఉన్నాయని నవ్వుతూ సమాధానమిచ్చారు.

నాసా లో దాదాపు మూడు దశాబ్దాలు పనిచేసిన సునీతా విలియమ్స్.. గతేడాది డిసెంబర్ 27న పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో మూడుసార్లు అంతరిక్షయానం చేసిన ఆమె.. 608 రోజులు ఐఎస్ఎస్‌లో ఉండి సుదీర్ఘ కాలం అంతరిక్షయానం చేసిన వ్యోమగాముల జాబితాలో చేరారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్నారు.

## ఏపీ గురించి అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక రంగం చర్చించుకుంటోంది: చంద్రబాబు

"మాది పరిశ్రమల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఈజ్ ఆఫ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులిస్తున్నాం. పరిశ్రమలకు ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నాం. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నాం. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించగలిగాం.

వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేస్తున్నాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి.

30 ఏళ్ల కిందటే దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయి. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నాం. అవే రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయి. టెక్నాలజీ, గ్రీన్–బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఏపీలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది నా ఆలోచన. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. ఆ స్థాయిలోనే పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోంది. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత్‌కు లేదు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారత్ అదనపు బలం" అని చంద్రబాబు అన్నారు.

## ఏపీ మద్యం కేసు.. ముగ్గురు నిందితులకు సుప్రీంలో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: ఏపీ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. దీని కోసం ట్రయల్‌కోర్టుకు వెళ్లాలని సీజేఐ ధర్మాసం సూచిస్తూ 4 వారాల గడువు ఇచ్చింది. నిందితులు ముగ్గురూ ఇప్పటికే డిఫాల్ట్ బెయిల్‌పై ఉన్నట్లు ప్రభుత్వ న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దీంతో డిఫాల్ట్ బెయిల్‌ను రెగ్యులర్ బెయిల్‌గా మార్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నిబంధనలు అనుసరించాల్సిందేనని స్పష్టం చేసింది.

## టీ20 ప్రపంచ కప్.. అది వింత అనుభవం అవుతుంది: రోహిత్ శర్మ

మొదటి పేజీ తరువాయి

తొలిసారి టీ20 ప్రపంచ కప్‌నకు దూరం కావడంపై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఎమోషనల్ అయ్యాడు. మొదటిసారి టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను ఇంట్లో కూర్చొని చూడటం తనకు వింత అనుభవం అవుతుందన్నాడు. ప్రస్తుతం రోహిత్ టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికి వన్డేలు మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 7 నుంచి 2026 టీ20 ప్రపంచ కప్ మొదలుకానుండటంతో హిట్‌మ్యాన్ గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు.

"టీ20 ప్రపంచ కప్ గురించి మేం ఇంట్లో మాట్లాడుకుంటున్నాం. ఇంట్లో కూర్చొని మ్యాచ్‌లు చూడటం వింత అనుభవం. ఈ టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నేను ప్రతి ప్రపంచ కప్‌లో భాగమయ్యాను. కాబట్టి.. ఇది భిన్నంగా అనిపిస్తుంది. వరల్డ్ కప్‌ను మిస్ అయినప్పుడు మనం అందులో ఆడట్లేదు కదా అని గుర్తొస్తుంది" అని రోహిత్ (=శీష్ట్రఓ ూష్ణుతీఝ) పేర్కొన్నాడు. తన కెప్టెన్సీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిని సంతోష పెట్టలేమని.. ప్రపంచ కప్‌లకు ముందు కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోక తప్పదన్నాడు. 2007 మొట్టమొదటి ఎడిషన్ నుంచి 2024 వరకు జరిగిన తొమ్మిది ప్రపంచ కప్‌ల్లో హిట్‌మ్యాన్ ఆడాడు. బంగ్లాదేశ్ ఆటగాడు షకీబ్ అల్ హసన్, రోహిత్ మాత్రమే అన్ని ఎడిషన్లలో ఆడటం విశేషం. గత ఎడిషన్‌లో రోహిత్ సారథ్యంలో భారత్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

# ప్రపంచ ఆర్థిక సదస్సు..

## సీఎం రేవంత్‌తో కలిసి పాల్గొన్న చిరంజీవి

మొదటి పేజీ తరువాయి



అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది. అనంతరం చిరంజీవితో రేవంత్ మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా వీక్షంచానని.. ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవికి సీఎం అభినందనలు తెలిపారు.చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర నిమిత్తం స్విట్జర్లాండ్ వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు.

# హేతువాద, మానవవాద తాత్వికుడు: రావిపూడి వెంకటాద్రి

హేతువాదం, మానవవాదం అనే పదాల మీద విస్తృతమైన తెలుగు సాహిత్యాన్ని సృష్టించిన రచయిత, కార్యశీలి, తాత్వికుడు రావిపూడి వెంకటాద్రి. చదివింది ఇంటర్మీడియట్ అయినా ఆయన సృష్టించిన సాహిత్యానికి ఎన్ని డిగ్రీలు, ఎన్ని డాక్టరేట్?లు ఇచ్చినా సరిపోవేమో! ఆయన రచనలను స్థూలంగా పరిశీలించినప్పుడు-- మానవ జీవన అంతరంగాన్ని తాకే ఏ అంశాన్నీ ఆయన వదిలిపెట్టలేదు. 1946 లో విశ్వాన్వేషణతో మొదలైన ఆయన రచనా ప్రస్థానం 2023 జనవరి 21న మరణానికి 20 రోజుల ముందు వరకు కొనసాగింది. చిన్నతనం నుంచి మత సాహిత్యాన్ని చదివి పెరిగిన ఆయన మాటల్లో, రచనల్లోనూ హిందూమతం, ఇతర మత భావజాలాలపై అధిక సాధికారత కనిపిస్తుంది. అలాగే సమకాలీనంగా సాగిన శాస్త్ర పరిశోధనలను ఆసాంతం అర్థం చేసుకున్న వ్యక్తి ఆయన. మత సాహిత్యం చదివినా, విజ్ఞాన శాస్త్రాలను చదివినా ఆయన ఎక్కడా తన ఆలోచనలో ఉన్న మానవీయ తాత్విక భావజాలాన్ని వదిలిపెట్టలేదు. పైగా ప్రతీ విషయాన్ని 'హేతువాద ఆకురాయి'తో పరీక్షించకుండా వదిలిపెట్టలేదు. మత గ్రంథాలను, పిడివాదాలను, జడవాదాలను ఆయన ప్రశ్నించిన తీరు చాలా ఘాటైనది. ఆయన చేసిన విమర్శలు, ఆయన అడిగిన ప్రశ్నలు దశాబ్దాలుగా వివరణలకు, జవాబులకు నోచుకోలేదంటే ఆయన హేతువాద స్థాయి, ప్రశ్నల స్థాయి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఆయన చిన్నతనంలో చేపట్టిన మత విమర్శను మాత్రమే కొనసాగించకుండా, మతాలకు విరుగుడు ఏమిటా? అని ఆలోచించారు. మత భావాలకు సరైన సమాధానాలు ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనా ఫలితాలు మాత్రమే ఇవ్వగలవని గుర్తించి, తన అధ్యయనాన్ని అటువైపుగా మళ్ళించారు. వైజ్ఞానిక వెలుగులో పురాణేతిహాసాలను చూసి అందులో ఉన్న డొల్లతనాన్ని గుర్తించి, బాహాటంగానే ప్రకటించారు. అందరూ అచంచల విశ్వాసంతో పాటించే మతభావాలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, మతం అంటే మూసుకుపోయిన ఆలోచనే అని, "అసలు మారేది మతమే కాదని, మారనిది సైన్సే కాద"ని నిర్ధారించి, సూత్రీకరించారు. మత వ్యతిరేకత, శాస్త్రీయ విజ్ఞానం వెంకటాద్రిని నాస్తికవాదం వైపు నడిపించాయి. అయితే ఆయన సత్యాన్వేషణ అక్కడితో ఆగిపోలేదు. హేతువాద ఉద్యమానికి కేవలం 'పురోహిత వ్యతిరేకత', 'దైవ నిరాకరణ' మాత్రమే లక్ష్యంగా ఉండరాదని ఆయన భావించారు. ఆ ఉద్యమాన్ని క్రమంగా మానవవాద బాట పట్టించారు. మానవేంద్రనాథ్ రాయ్ (ఎం.ఎన్. రాయ్) భావజాలంతో ప్రభావితుడైన వెంకటాద్రి, రాడికల్ హ్యూమనిస్ట్... మెల్లగా ఆ ఆదర్శాల వైపు మళ్లారు. వాటిని తీవ్రంగా అధ్యయనం చేసిన ఆయన, మానవవాదం అంటే-- ఏ వ్యక్తీ పుట్టుకతో వివక్ష అనుభవించరాదని, మానవులందరికీ అన్ని వ్యవస్థలలో, అన్ని విధానాలలోనూ 'స్వేచ్ఛ' ప్రధానమైన విలువ అని గుర్తించారు. భావవాదం, ఆధ్యాత్మికత అనేవి కవల పిల్లలని, అవి ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి వ్యతిరేకంగా మాట్లాడతాయని, కానీ



ఆచరణలో మాత్రం స్వాములు, భక్తులు, బాబాలు, ప్రవచనకారులు అందరూ ఆధునిక శాస్త్ర విజ్ఞానం ఉప ఉత్పత్తిగా వచ్చిన సాంకేతిక శాస్త్రాన్ని... అంటే టెక్నాలజీని, శాస్త్రీయ పరికరాలన్నింటినీ అందరికంటే ఎక్కువగా వాడుకుంటారని సున్నితంగా చెప్పారు. యూరప్‌లో వచ్చినట్టుగా శాస్త్ర విజ్ఞానాల పునర్జీవనం ఇంతవరకు భారతదేశంలో మొదలే కాలేదని గుర్తు చేశారు. రాజా రామ్మోహన్?రాయ్?ను భారతీయులు ఆదర్శంగా తీసుకోవడం చాలా పొరపాటని, అదే బెంగాల్? రాష్ట్రంలో పుట్టిన హెన్రీ దేరాజియాను, ఆయన భావాలను వెదజల్లగలిగితే భారతదేశ స్వరూపం ఇప్పుడు మరో విధంగా ఉండేదని తన రచనల నిండా చెప్పారు. మత సాహిత్యం చాలా ఉన్నదని, అది అజ్ఞానాన్ని, ఆచారాలను, సంప్రదాయాలను వ్యవస్థీకృతం చేస్తున్నదని వెంకటాద్రి తన రచనలలో తెలిపారు. ఆ స్థాయిలో హేతువాద మానవవాద సాహిత్యం వచ్చినప్పుడే మన సమాజంలో మార్పు సాధ్యమన్నారు. తెలుగు హేతువాద సాహిత్యంలో రావిపూడి వెంకటాద్రి పేరు ఒక రచయితగా మాత్రమే కాదు, ఒక ఆలోచనా ప్రవాహంగా నిలుస్తుంది. ఆయన చేసిన రచనలను, పుస్తకాల జాబితాగా చూస్తే సంఖ్యలు కనిపిస్తాయి. కానీ ఆ సంఖ్యల వెనుక ఒకే ప్రశ్న తిరుగుతుంది. అదేమిటంటే... మనిషి స్వేచ్ఛగా, గౌరవంగా, ఆనందంగా, వివక్ష లేకుండా బతకాలంటే-- దేవుడు, మతం, ఆచారం, సంప్రదాయం, మూఢ నమ్మకాలు ఏ స్థాయిలోనూ ఉండకూడదు. ఈ ఒక్క అంశమే ఆయన జీవితాన్ని, రచనలను, ఉద్యమాన్ని ఒక "తాత్విక ఏకత్వంలో" నిలిపింది. రావిపూడి వారి ప్రత్యేకత ఏమిటంటే ఆయన హేతువాద ఉద్యమాన్ని కూడా హేతువాదంతోనే పరిశీలించారు. హేతువాదం అంటే కేవలం దేవుడిని తిట్టడమా మతాన్ని ఖండించడమేనా? అంతేనా మన లక్ష్యం? ఈ ప్రశ్నలు ఉద్యమం లోపల కన్నా, ఆయన నుంచే రావడం వల్ల అవి అసౌకర్యంగా అనిపించాయి. కానీ అవే ప్రశ్నలు ఉద్యమానికి సరైన దిశను చూపించాయి. మూసుకుపోయిన ఆలోచనలను సైతం మొగ్గ తొడిగించడం రావిపూడి వారి ప్రత్యేకత. అనేక ప్రత్యేకతలతో ప్రపంచంలో 102 సంవత్సరాలు నడయాడిన ఆధునిక హేతువాద మానవవాద తాత్వికుడు ఆయన. "ప్రపంచ తాత్విక చరిత్ర పుస్తకం"పై ముఖచిత్రంగా వేయదగిన మహా'మనీషి' ఆయన. మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు, భావాలు ఇంకా ఈ ప్రపంచ ప్రజల భావవీధుల్లో జీవిస్తూనే ఉంటాయి. మనిషిని కేంద్రంగా పెట్టని, గౌరవించని ఏ భావజాలమైనా చివరికి మనిషినే నాశనం చేస్తుంది.

కె.శ్రీనివాసాచారి అధ్యక్షులు, తెలంగాణ హేతువాద సంఘం జవ: 7780664115, 8096653459

# కావడి గుండ్ల గ్రామంలో పులి తిరిగిన ప్రదేశాలను పర్యవేక్షణ

**అశ్వారావుపేట మండలంలో పులి సంచారం**

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కావడి గుండ్ల గ్రామం మరియు చుట్టుపక్కల గ్రామ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పులి ఆవుల పై దాడి చేసినట్లు, పులి అడుగుజాడలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని పోలీసు అధికారులు, అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే వారు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా పులి కదలికలపై నిఘా పెంచినట్లు తెలిపారు. ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ క్రీడా కమిటీ అధ్యక్షులు గా నర్సోల్ల ఐలయ్య





జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ క్రీడా కమిటి అధ్యక్షులు నర్సొల్ల ఐలయ్య, ఉపాధ్యక్షులు తుమ్మ సంతోష్-మన్నె హేమంత్, ప్రధాన కార్యదర్శి బక్కోళ్ల మల్లేష్,ఆర్గనైజర్ బత్తిని ప్రవీణ్, కోశాధికారి ఎల్లోళ్ల నాగరాజు, కార్యదర్శి వీరబత్తిని అజయ్ గార్ల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో విన్నర్ గా తుమ్మ సంతోష్ అండ్ టీం కప్ తో పాటు 5000 ప్రైజ్ మనీ రన్నర్ గా స్వామి అండ్ టీం కప్ తో పాటు 2500 ప్రైజ్ మనీ గెల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతగా నిల్చిన తుమ్మ సంతోష్ అండ్ టీం తమ ప్రైజ్ మనీ నుండి గ్రామంలో అనారోగ్యం బారిన పడ్డ ఎర్రోళ్ల ఆనంద్ కి ఒక నెలకు సరిపడే మందుల కోసం ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

# కాంగ్రెస్ నమ్మకానికి నిలువుటద్దం

**- సిద్ధాంతమే ఊపిరిగా...**

**- పార్టీ జెండానే ప్రాణంగా...**

**- దశాబ్దాల రాజకీయ ప్రస్థానం!**

**- మున్సిపల్ చైర్మన్ బరిలో వారి సతీమణి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ కేంద్రం రాజకీయాల్లో పదవులు రావడం, పోవడం సహజం కానీ నమ్మిన సిద్ధాంతం కోసం కష్టకాలంలో కూడా పార్టీ జెండాను భుజానకెత్తుకుని నడిచే నాయకులు అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన, నిఖార్సైన కాంగ్రెస్ వాది మొగళ్లపు చెన్నకేశవరావు అశ్వారావుపేట రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసి, మండల పార్టీని అగ్రపథాన నిలిపిన ఘనత ఆయనది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అందరూ వెంట ఉంటారు. కానీ, పార్టీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు అనేక ఒడిదుడుకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ధీశాలి చెన్నకేశవరావు సుదీర్ఘకాలం కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా ఉండి కాంగ్రెస్



పార్టీ అధిష్టానం ఇచ్చిన కార్యక్రమాలను తప్పకుండా అమలు చేసిన ఘనత ఆయనది. అడిగిన వారికి లేదనకుండా సహాయం చేసిన ఉదార స్వభావం వారిది. ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా కేవలం హస్తం గుర్తును నమ్మి ప్రజల పక్షాన నిలిచారు. ఆయన ఒక్కరే కాదు ఆయన సతీమణి మొగళ్ళపు ఉదయ నాగలక్ష్మి కూడా కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ, మహిళా కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు. ఎంపీటీసీగా విశిష్ట సేవలందించారు. గత జడ్పిటిసి ఎన్నికల్లో పోటీ చేసి తనదైన పాత్ర పోషించారు. రాజకీయాల్లో ఒక కుటుంబం మొత్తం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండటం వారి నిబద్ధతకు నిదర్శనం. 2009 ఎన్నికల్లో ఎస్టి రిజర్వేషన్ అయిన సందర్భంలో అన్నీ తానై ఒక మండల నాయకుడైన వగ్గెల మిత్రసేనను అధిష్టానం వద్దకు తీసుకెళ్లి అప్పటి ఫైర్ బ్రాండ్ పార్లమెంట్ సభ్యురాలు రేణుక చౌదరి ఆశీస్సులతో టికెట్ ఇప్పించుకొని ఎమ్మెల్యేగా గెలిపించుకున్న చరిత్ర మరువ రానిది. రాష్ట్రస్థాయిలో ఎందరో సీనియర్ నాయకులతో కలిసి పనిచేసిన అనుభవం ఆయన సొంతం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వంటి నాయకుల ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లతో సాన్నిహిత్య సంబంధాలున్నాయి. ఎంతోమంది లీడర్లు వర్గపోరును ప్రోత్సహిస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బ తీసే సమయంలో కూడా వర్గ పోరును పట్టించుకోకుండా పార్టీ అభివృద్ధికే కృషి చేసిన ఘనత ఆయనది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంపై అపారమైన నమ్మకంతో వారి ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఒకానొక సందర్భంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, అవమానాలకు గురైనా ఆయన తొనకలేదు, బెనకలేదు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదు అనే భావనతో, నిజమైన కార్యకర్తల గొంతుకగా నిలబడ్డారు. కష్టకాలంలో నిలబడ్డ వారికే రేపటి విజయంలో ప్రాధాన్యత ఉండాలని ప్రజలు, కార్యకర్తలు బలంగా కోరుకుంటున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అశ్వారావుపేట అభివృద్ధి చెందాలన్నా, సామాన్యుడి గొంతు వినిపించాలన్నా చెన్నకేశవరావు వంటి అనుభవజ్ఞుడైన నాయకుడికి తగిన ప్రాధాన్యత దక్కాల్సిన అవసరం ఉంది. ఆయన నాయకత్వంలో మండల పార్టీ ఎన్నో విజయాలను చూసింది. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాలను తెలుసుకునే గుణం ఆయనను 'ప్రజా నాయకుడిని' చేసింది. అశ్వారావుపేట కాంగ్రెస్ కోటను కాపాడుకోవాలన్నా, మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించాలన్నా సున్నిత మనస్తత్వం, నిరాడంబరిత కాంగ్రెస్ పార్టీ ఎడల అంకిత భావం గల మొగళ్లపు చెన్నకేశవరావు నాయకత్వం అత్యవసరమని ప్రజలు భావిస్తున్నారు.

# వినాయక నగర్ లో రోడ్డు భద్రత అవగాహన సదస్సు :




మల్కాజ్గిరి పరిధిలోని వినాయక నగర్ లో టీ జి పి డబ్ల్యూ యు ఒ బీ ఆర్ టీ యు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెలివరీ బాయ్స్ డ్రైవర్లు కుటుంబ బాధ్యతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. హెల్మెట్ సీట్ బెల్ట్ పెట్టుకోవడం మరిచిపోవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎస్సై అవినాష్ ట్రాఫిక్ నియమాల ప్రాధాన్యతను వివరించారు.

# మార్కండేయ మహర్షి జయంతి వేడుక



దంతాలపల్లి మండల కేంద్రంలో శ్రీ చైతన్య పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కేంద్రానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పొన్నొటి బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరై మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ పద్మశాలి సంఘం సంక్షేమానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంకం సతీష్?తో పాటు బొల్లు వీరన్న వీరబత్తిని శ్రీనివాస్, పొన్నం వెంకటేశ్వర్లు, మార్గం శ్రీనివాస్, కూరపాటి పద్మయ్య, సురేష్, శ్రీకాంత్, జల్ల శ్రీనివాస్, పెండెం రమేష్, శివాజీ, బుధరపు శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, అనుమాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ నీ మర్యాద పూర్వకంగా కలిసిన తాటి



హైదరాబాద్ నందినగర్ లో మాజీ మంత్రివర్యులు బిఆరచవతీతీచస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నీ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ప్రసాదాన్ని అందజేసిన బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ తొలి ట్రైకార్ చైర్మన్ బిఆరచవతీతీచస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు వారి కుమారుడు తాటి రవి కుమార్ ఈ సందర్భంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారానికి కేటీఆర్ ని రావాలని కోరారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా రాష్ట్రస్థాయి నేతను నియమించాలని కేటీఆర్ ని తాటి కోరారు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి అశ్వారావుపేట మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని తాటికి కేటీఆర్ సూచించారు.

# ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలి..

**- ప్రమాదాలను తగ్గించడమే అరైవ్ అలైవ్- 2026 ముఖ్య ఉద్దేశం..**

**- సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు,కీసర పోలీస్ స్టేషన్**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మక అరైవ్ అలైవ్- 2026 క్యాంపెయిన్ ను డీజీపీ మార్గదర్శకత్వంలో బుధవారం కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో అరైవ్ అలైవ్- 2026లో భాగంగా డే--6 కార్యక్రమాన్ని బండ్లగూడ ఎక్స్ రోడ్ వద్ద ఎసచవతీతీచ లు నాగరాజు, శ్రీనివాస్ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, రోజువారీ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకొని రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. "మద్యం సేవించి వాహనం నడపకండి" ప్రాణాలు పోతాయి. "ట్రాఫిక్ నిబంధనలు పాటించండి -- అవి ప్రాణాలను కాపాడుతాయి" అంటూ వివరిస్తూ ప్రతి వాహనాదారుడు "హెల్మెట్, సీట్?బెల్ట్ తప్పనిసరిగా ధరించండి", "వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకండి", "అతివేగంగా ప్రయాణం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ ప్రమాదకరం" అలాగే "పాదచారుల భద్రత అందరి బాధ్యతగాభావించాలి. "తప్పు మార్గాల్లో వాహనం నడపవద్దు", "వాహనాలపై పెండింగ్ చలాన్లను తరచూ పరిశీలించి చెల్లించండి" వంటి ముఖ్యమైన సందేశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై పోస్టర్లు, చిన్న సందేశాలను ప్రజల్లో పంపిణీ చేయడంతో పాటు సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఇన్?స్టాగ్రామ్, ఫేస్?బుక్ ద్వారా ప్రచారం చేపట్టారు. స్థానిక మీడియా, రేడియో, టీవీ ఛానళ్ల ద్వారా కూడా ఈ కార్యక్రమంపై సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు ఉన్నతాధికారులు రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై మాట్లాడగా, ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ అరైవ్ అలైవ్- 2026 ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలనే లక్ష్యాన్ని సాధించేందుకు కీసర పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరినవారు ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే జారే



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం టౌన్ అధ్యక్షులు చిన్నంశెట్టి పవన్, చిన్నంశెట్టి శ్రీను, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి మూడు రంగుల కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరటం శుభ పరిణామం అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పార్టీలో చేరిన నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరా వేస్తాం

**- మున్సిపల్ ఎన్నికల ముఖ్య సమావేశం**

**- ముఖ్య అతిధిగా పార్లమెంటు ఇంచార్జ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లి**

**- సంక్షేమ పథకాలే కాంగ్రెస్?ను గెలిపిస్తాయి**

**- ఈ ప్రాంతాన్ని దోచుకున్న దొంగలకు బుద్ధి చెప్పాలి**



అన్ని వార్డులను కైవసం చేసుకునేలా కార్యకర్తలు కష్టపడాలి రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా అందిస్తామని రాష్ట్ర మంత్రి వర్యులు,మేడ్చల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీలోని శుభం గార్డెన్?లో మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు. ఎన్నికల హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహజ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వంటి పథకాలతో పాటు మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. దోపిడీదారులను తరిమికొట్టాలి వజ్రేష్ యాదవ్ ఇక్కడి ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఈ ప్రాంతాన్ని దోచుకున్న దోపిడీదారులకు తగిన బుద్ధి చెప్పాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ధనబలంతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్న పగటి వేషధారులను ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు. మూడు మున్సిపాలిటీల్లో మెజారిటీ వార్డులను కైవసం చేసుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబులకు కానుకగా అందిస్తామని తెలిపారు. ఇప్పటి నుంచే గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థుల వివరాలు సేకరించి, అర్హులైన వారికి పార్టీ టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. టికెట్ ఎవరికివచ్చినా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిసర మైపాల్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఏ, బి అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, వేముల మహేష్ గౌడ్, అలియాబాద్ అధ్యక్షులు తుంకి రమేష్, ఎల్లంపేట్ మున్సిపల్ అధ్యక్షులు విఘ్నేశ్వర రెడ్డి, మూడు చింతలపల్లి అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్? తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ పై క్యాంపెయిన్

**- డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రయాణాలతో జీవితాలకు శాపం..**

**- జవహర్ నగర్ సిఐ ఎస్. సదయ్య**







జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీ నగర్?లో రోడ్డు భద్రతపై మీడియా ఔట్రీచ్ దినోత్సవంలో భాగంగా అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ - 2026ను ఘనంగా నిర్వహించడం జరిగింది. బుధవారం జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలసి సమన్వయంతో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక వాహనదారులకు సూచనలు సలహాలు వాటి నియమాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన, రోడ్డు ప్రమాదాలను ఎలా తగ్గించడం, వాటి గురించి జవహర్ నగర్ వాహన ప్రయాణికులకు సురక్షితమైన రోడ్డు ప్రయాణంలో ప్రమాదాలను నివారించడంలో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎస్. సదయ్య, ఎసచవతీతీచపి రాము, ఎసచవతీతీచపి లక్ష్మయ్య, ఎసచవతీతీచబి బి. వేణు మాధవ్, ఎసచవతీతీచపి మౌనిక, పాత్రో మొబైల్--×× సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుండి పిసి లు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతోపాటు నాలుగు చక్రాల వాహనాల డ్రైవర్లు చురుకుగా పాల్గొన్నారు.

# ప్రజల తరపున పోరాడుతున్న సిపిఎం పార్టీ 12వ వార్డు అభ్యర్థి బండ్లస్వామి ని గెలిపించండి

**- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ 5 వార్డుల్లో పోటీ**




గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 2026 ఎన్నికల్లో సిపిఎం పార్టీ ఐదు వార్డులో పోటీ చేస్తుందని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య తెలిపారు మొదటి దఫాగా12 వ వార్డు అభ్యర్థిగా బండ్ల స్వామిని ప్రకటించడం జరిగింది సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గజ్వేల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ గా ఇళ్ల స్థలాలు,సిసి రోడ్లు, మున్సిపల్ అనేక రకాల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు, కార్మికులు, రైతులు,ఉద్యోగుల, మహిళల,సమస్యలపై పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు మల్లన్న సాగర్ భూసేకరణ సమయంలో సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి 15 రోజులపాటు గ్రామాలలో పర్యటించి ప్రజలను చైతన్యం చేశారని అన్నారు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, నష్టపరిహారం పెంచాలని ఆందోళన చేయడం జరిగిందని అన్నారు. సిపిఎం పార్టీ నాయకులు గ్రామాల ప్రజల కోసం 14 రోజులపాటు జైలు శిక్ష అనుభవించడం జరిగిందని అన్నారు పంపు గ్రామాల ప్రజలందరికీ ప్యాకేజీలు ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని, ఇల్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేయాలని అనేక దఫాలుగా ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు ప్రజల తరపున పోరాడే సిపిఎం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. బండ్ల స్వామి కార్మికునిగా ఉద్యోగం నిర్వహించుకుంటూ ప్రజల కోసం గత 25 సంవత్సరాలుగా పేదలు, రైతుల పక్షాన పోరాటం నిర్వహించడం జరుగుతుందని 12 వ వార్డులో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రంగారెడ్డి, హమ్మద్ బాయ్, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయి జీతాలు ఇవ్వాలని విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

**- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్మికులకు బకాయి పడిన జీతాలు ఇవ్వాలని విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన జరిగింది. సందర్భంగా సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ వేతనాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఇన్చార్జి ఎసచవతీతీచ రమేష్ చర్చలు జరపడం జరిగింది. రెండు రోజుల్లో జీతాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కనకయ్య సురేందర్ యాదగిరి లక్ష్మణ్ హరి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

**- తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు**



జెడ్ పి హెచచవతీతీచస్ తిమ్మాపూర్ పాఠశాల లో బుధవారం పాఠశాల పదవ తరగతి విద్యార్థులు వారి తల్లితండ్రులు మరియు స్కూల్ టీచర్స్ తో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ పోసాన్ పల్లి రాజు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ మాట్లాడారు విద్యార్థులు అందరూ 100% ఉత్తీర్ణత సాధించాలని కోరారు. పబ్లిక్ పరీక్షలకు కేవలం 50 రోజులు మాత్రమే ఉంది కావున ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక బద్దంగా చదవాలని తెలిపారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో తల్లి తండ్రులు విద్యార్థులకు ఏ విధమైన పనులు చెప్పకుండా వారికి ఇంట్లో ఒక ప్రశాంతమైన వాతావరణ కలిగిన ప్రదేశాన్ని కేటాయించి వారి యొక్క చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు విద్యార్థులు ఈ 50 రోజులు సబ్జెక్టుల వారిగా సమయాన్ని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు అత్యధిక మార్కులు సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం శ్రీనివాసు స్థానిక ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు పాఠశాల ఉపాధ్యాయులు విద్యా కమిటీ అధ్యక్షులు కొంత కృష్ణంరాజు ప్రధాన కార్యదర్శి దండు నవీన్, కొంతం కిష్టయ్య, మహేష్, కొంతం రాజు, శ్రీశైలం, ఆగమల్లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి రామయ్య పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ధర్మారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ నీటి సంఘం చైర్మన్ ఎర్రబెల్లి రామయ్య( రామారావు) పరమాపదించగా వారి పార్థివదేహానికి పూలమాలవేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మండల వివిధ అనుబంధ సంఘాల నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149




ఈకాలం
THE HONEST TELUGU DAILY








# అర్హులందరికీ ఇళ్ళు!

## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఈకాలం, ఆదిలాబాద్: అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉట్నూర్ మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామంలో బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన లింగంపెల్లి తారమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహానికి నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమాని తారమ్మను పట్టు చీర అందించి సత్కరించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని తెలిపారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఇప్పటివరకు జిల్లాకు రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తూ, పనుల పురోగతిని బట్టి వారం వారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గృహ యజమాని తారమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులకు మంత్రులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కి అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మట్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## లోకల్ న్యూస్

### గల్లీ లొల్లి

ఆదిలాబాద్ పట్టణం బుక్తాపూర్ 49 వార్డులో బుధవారం మాజీ కౌన్సిలర్ ప్రకాష్, తాజా కౌన్సిలర్ అభ్యర్థి బండారి సంతోష్ ల నడుమ గల్లీ లొల్లి నెలకొంది. కాలనీలో ఇందిరమ్మ చీరల పంపకం జరుగుతుండగా అక్కడికి వచ్చిన బండారి సంతోష్ ను నీది పక్క కాలనీ వెళ్లిపో అని ప్రకాష్ అనడంతో విషయం రచ్చకెక్కింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన బండారి సంతోష్ తను అదిలాబాద్ వాసీనని ఎక్కడికైనా వెళ్లే అధికారం తనకుందని సోషల్ మీడియాలో వివరించారు. తాను అదే కాలనీ నుంచి కౌన్సిలర్ గా పోటీ చేయడాన్ని జీర్ణించుకోలేకనే ప్రకాష్ అలా మాట్లాడాడని చెప్పారు.

- ఈకాలం ఆదిలాబాద్



# కేఆర్కే కాలనీ ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

## - ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎన్నికలు వస్తున్నాయంటేనే అన్ని రాజకీయ పార్టీలకు కేఆర్కే కాలనీ గుర్తుకు వస్తుందని, కానీ ఇప్పటివరకు పాలించిన కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్ పార్టీలు ఇక్కడి ప్రజల గురించి పట్టించుకోలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.



**ఈకాలం ఆదిలాబాద్** ఈకాలం, ఆదిలాబాద్ : ఎన్నికలు వస్తున్నాయంటేనే అన్ని రాజకీయ పార్టీలకు కేఆర్కే కాలనీ గుర్తుకు వస్తుందని, కానీ ఇప్పటివరకు పాలించిన కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్ పార్టీలు ఇక్కడి ప్రజల గురించి పట్టించుకోలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం కాలనీకి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, రాము, రత్నాకర్ రెడ్డి, దయాకర్, సాయి, రాము, పద్మ, రేఖ కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... కే.ఆర్.కే కాలనీలో రోడ్లపై నడవలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు తాను సొంతగా తాత్కాలికంగా రోడ్ల సౌకర్యం కల్పించానని గుర్తు చేశారు. వేసవి కాలంలో తాగడానికి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్ లను పంపించడం జరిగిందన్నారు. కేఆర్కే కాలనీలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సైతం బీజేపీకి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

**ఆధ్యాత్మికం** - జక్కుల వెంకటేష్, సామాజిక కార్యకర్త, బోథ్

# పురాతన ఆలయాలకు పునర్వైభవం తీసుకొద్దాం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో చుట్టుపక్కల ఎంతో మహిమాన్వితమైన,పురాతణమైన, చారిత్రాత్మాకమైన, అందమైన శిల్ప కళ కలిగిన ఆలయాలున్నాయి. ఉదా :- సిరిచేల్మా, శాంతాపూర్ రామాలయం, బూరుగుపల్లె, బాబాపూర్, కదిలి, అర్లి వద్ద సిద్దేశ్వర్, బ్రహ్మేశ్వర్, ధర్మాబాద్ దగ్గర లో గల సంగమేశ్వర్, ధర్మాబాద్ దగ్గర యఉతి లోని శివాలయం... మన సంస్కృతి, ఆచార, సాంప్రాధాయాలను ప్రతిబింబింప చేసే ఆలయాలు ఇలా ఎన్నెన్నో.. కానీ, కొన్ని ఆలయాలు శిథిలావస్థలో, కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నాయి. ఆలయాలు... మన పూర్వీకులు మనకు వారసత్వ సంపదగా ఇచ్చిన భక్తి, జ్ఞానాలకు సంబంధించిన ఆస్తి. మన ఉనికి, మన ఆస్థిత్వం, అభివృద్ధి.. ఎన్నో సమస్యలకు పరిష్కారం చూయించే కేంద్రాలు. నూతనంగా ఎన్నో ఆలయాలు నిర్మిస్తున్నాం. మంచిదే. మరి మన పూర్వీకులచే నిర్మించిన కట్టడాలు విస్మరించలేము కదా. ఒక్కొక్క ఆలయ చరిత్ర చూస్తే... కొన్ని వందల సంవత్సరాలు. 1200,1500,1600 ఇలా వందల సంవత్సరాలు మాత్రమే కాదు, భగవాన్ శ్రీ పరుశురాముల వారిచే, బ్రహ్మ దేవుల వారిచే ప్రతిష్టింపబడిన దేవతామూర్తులు ఎన్నో ప్రత్యేకతలు గలవి. నదీ తీరానా ఉన్నవి ఎన్నో.. ఎన్నెన్నో.. అభివృద్ధి చేయకుండా వదిలేద్దామా? ఏమీ చేయలేమా..? ఆలోచిద్దాం... ప్రయత్నిద్దాము... తొలి అడుగు మనమే వేద్దాం. ఒక రోజు ఈ ఆలయాలను దర్శిద్దామా? చుట్టూ పక్కల గ్రామస్థులతో మాట్లాడుదామా..? సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పిద్దామా...? ఇది ఒక దీక్షనే.. ఒక వ్రతమే. జనాలకు ఉపయోగపడే దేవాలయం గూర్చి మనం ఆలోచించినప్పుడు తప్పకుండా భగవంతుడు మన బాగోగులు చూస్తాడు. ఆలయం అభివృద్ధి అయితే... సమాజం, ఊరు అభివృద్ధి ఆవుతుంది. ఎందరికో ఉపాధి దొరుకుతుంది. ఎందరో మంది జీవితాలు సుగుణాలతో బాగుపడతాయి. మంచి అనేది దొరుకుద్ది.



ఇచ్చోడ మండలం లోని సిరిచల్మా పురాతన శివాలయం



## రోడ్డుభద్రతపై అవగాహన అవసరం - ఏఎంవిఐ హరేంద్ర కుమార్

ఈకాలం ఆదిలాబాద్: రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఏఎంవిఐ హరేంద్ర కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మోటార్ అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ నిహారిక కానిస్టేబుళ్లు, హోంగార్డులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం!

ఈకాలం | ఆదిలాబాద్

ఈకాలం ఆదిలాబాద్ : ఉద్యోగులు సంఘటితంగా ఉంటూ హక్కుల సాధన కోసం పాటుపడాలని టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఏ. నవీన్ కుమార్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు సందిల బలరాం అన్నారు. బుధవారం ఆదిలాబాద్ లోని బజరంగ్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ లోని ప్రతి పంచాయతీ కార్యదర్శి టీఎన్జీవో సభ్యత్వం తీసుకొని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరంలో విలీనం చేశారు. అనంతరం జిల్లా ఫోరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా జె.సంజీవరావు, కార్యదర్శిగా కె.అరుణ్ రెడ్డి, కోశాధికారి అనిల్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు డి నాగభూషణ్, ఈ రామదాస్, బి. వినోద్ , ట్రెజరర్ అనిల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్ జాయింట్ , సెక్రెటరీ గంగన్న, ఉమెన్ జాయింట్ సెక్రెతరి నస్సీమ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యనారాయణ తో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఎటువంటి సమస్య వచ్చిన టిఎన్జీవోస్ అండగా ఉంటుందని ఏ.నవీన్ కుమార్ తెలిపారు. టీఎన్జీవో యూనియన్ లో పంచాయతీ కార్యదర్శులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని భరోసా కల్పించారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్నికైన నూతన కార్యవర్గం (03) సంవత్సరాల పాటు ఉంటుంది.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ ఉన్నారు.ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్,సునీల్ రెడ్డి,రాఘవేంద్ర, దుర్గయ్య,నాగభూషణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం



ఫెడరేషన్ లోని ప్రతి పంచాయతీ కార్యదర్శి టీఎన్జీవో సభ్యత్వం తీసుకొని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరంలో విలీనం అయిన అనంతరం నూతన జిల్లా కమిటీ





# శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో.. సప్తశక్తి సంగం!

ఈకాలం ఆదిలాబాద్: శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆదిలాబాద్ లో బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాల్లో బాగంగా మహిళా సప్త శక్తి సంఘం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది కొర్రి భారతి, వ్యాపారవేత్త కోటోజు సౌజన్య తో పాటు రాష్ట్ర సేవిక సమితి తెలంగాణ ప్రాంత తరుణి ప్రముఖ్ డా. కాంచన ముఖ్యఅతిథిగా పాల్గొని భారత దేశ ఉన్నతిలో మహిళల పాత్ర, మహిళా శక్తి గురించి వివరించారు.



## పిసిసి చీఫ్ ను కలిసిన స్విమ్మింగ్ కోచ్!

ఆదిలాబాద్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ బుధవారం పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిశారు. జిల్లాలో స్విమ్మింగ్ క్రీడకు సంబంధించిన సాధకబాధకాలను ఆయనకు వివరించారు. - ఈకాలం, ఆదిలాబాద్



# గ్రామాల్లో "ఉపాధి" తీర్మానం!

ఈకాలం, ఆదిలాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలన్న ప్రతిపాదనతో ప్రతి గ్రామ గ్రామాన గ్రామ సభలలో తీర్మానం చేయాలని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ సూచించారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని పలు వివరాలను వెల్లడించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశం తో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడం అన్యాయమని, గతంలో ఈ చట్టం ద్వారా 100 రోజుల పని హక్కు ఉండేదన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వీబీ జి రామ్ జి పథకం ద్వారా కేంద్రం నోటిఫై చేసి బడ్జెట్ కేటాయిస్తేనే పని ఉంటుందని, ఉపాధి హామీ పథకం పాత చట్టం లో 100 శాతం కేంద్రం నిధులు ఇచ్చేదని, కేంద్రం తన వాటాని తగ్గించుకొని రాష్ట్ర ప్రభుత్వాలపై భారం వేయడం కారణంగా నిధుల కొరత తో పనులు ఆగిపోయి గ్రామీణ పేదలకు ఉపాధి లేకుండా పోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజీద్ ఖాన్, మాజీ మార్కెట్ ఛైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి , మాజీ డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkajgiri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149